RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4 | దినపత్రిక
సంపుటి : 3, సంచిక : 166 | మే 27, 2025 | వెల : రూ.3-00



**నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తి అరెస్టు**

4లో..





## పేదరిక నిర్మూలన
# భారత్ లక్ష్యం
### మనతో శత్రుత్వం పాక్ టార్గెట్ : ప్రధాని మోదీ

**వేద న్యూస్, డెస్క్ :**

దేశ విభజన తర్వాత ఏర్పడిన పాకిస్థాన్ భారత్‌తో శత్రుత్వమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. రెండు రోజుల గుజరాత్ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ దోహద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. దోహద్లో దాదాపు రూ.24వేల కోట్ల విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. రైల్వే లోకోమోటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌తోపాటు 9వేల హార్స్‌పవర్ సామర్థ్యం కలిగిన దేశంలోనే తొలి లోకోమోటివ్ ఇంజిన్‌ను ప్రారంభించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి గుజరాత్ పర్యటనకు వచ్చిన ప్రధానికి ఘనస్వాగతం లభించింది. వడోదర విమానాశ్రయం నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న వైమానిక కేంద్రం వరకు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీపై స్థానికులు పూలవర్షం కురిపించారు. ప్రధాని మోదీ కాన్వాయ్ సాగుతుంటే ప్రజలు తివర్ణ పతాకాలను చేత పట్టుకొని సైన్యానికి అనుకూలంగా నినాదాలు చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని మోదీ పాకిస్థాన్‌పై విరుచుకుపడ్డారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ ప్రతీకారదాడులకు ప్రయత్నించగా, భారత సైన్యం వాటిని తిప్పికొట్టినట్లు తెలిపారు.

విభజన తర్వాత ఏర్పడిన పాకిస్థాన్ ఏకైక లక్ష్యం భారత్‌తో శత్రుత్వమన్నారు. భారత్ లక్ష్యం మాత్రం పేదరికాన్ని నిర్మూలించటం. ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయటం. అభివృద్ధి చెందటం. దేశ సైన్యం బలంగా ఉన్నప్పుడే వికసిత్ భారత్ సాధ్యమవుతుంది. అప్పుడు మన ఆర్థికవ్యవస్థ బలంగా ఉంటుంది అని ప్రధాని మోదీ అన్నారు. అంతేకాకుండా 2014లో ఇదే తేదీన ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారని గుర్తు చేసుకున్నారు.



### రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు
# పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వరంగల్ :**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జూన్ 2న జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అత్యంత వైభవంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాల్స్ ఏర్పాటు, ఇందిరమ్మ ఇల్లు, ట్రాన్స్పోర్ట్, ఆర్ అండ్ బి, ఫారెస్ట్,తదితర శాఖలు శకటాలు తయారు చేయవలసిందిగా సూచించారు.వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వేడుకల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, డిఎఫ్ఓ అనుజ్ అగర్వాల్ వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్ లేకుండా అమ్మకం చేస్తే చర్యలు

4లో..



# జూన్ 1 నుంచి మూడు నెలల బియ్యం పంపిణీ

- జిల్లాలో 4,85,599 మందికి లబ్ధి

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



వర్షాకాలం నేపథ్యంలో గతంలో ఎన్నడూలేని విధంగా జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు జూన్ మాసంలో జూన్ మాసంలో 1 నుంచి 30 వరకు ఒకేసారి రేషన్ లబ్ధిదారులకు అందించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది.దీంతో జిల్లాలో పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖల అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతినెలా సరఫరా చేసే ఎంఎల్ఎస్ (మండల్ లెవల్ స్టాక్) పాయింట్ల నుంచి రేషన్ షాపులకు బియ్యం రవాణా ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించనున్నారు. జిల్లాలోని నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ, నకిరేకల్, నిడమనూరు,పెద్దవూర, దేవరకొండ, చండూరు, నాంపల్లి పరిధిలోని ఎంఎల్ఎస్ పాయింట్లు నుంచి బియ్యాన్ని తరలింపు చేస్తున్నారు. అయితే మూడు నెలలకు సంబంధించి ఒకేసారి పంపిణీ చేయనుండడంతో సుమారు ఎన్ని క్వింటాళ్ల బియ్యం అవసరం ఉన్న దానిపై అంచనాలు తీస్తున్నారు. అయితే ఒకేసారి బియ్యం కాకుండా విడతలవారీగా సరఫరా చేయాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా 991 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 4లక్షల 85 వేల 599 రేషన్ కార్డులు ఉన్నాయి. దీంతో వారందరికీ మోక్షం కలగనుంది. అయితే లబ్ధిదారులు ఒకేసారి మూడు నెలల బియ్యం తీసుకునేందుకు మూడుసార్లు బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న రేషన్ షాపుల్లో గరిష్టగా 250 క్వింటాళ్ల బియ్యం నిల్వ చేసుకునేందుకే సామర్థ్యం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో ఒకేసారి మూడు నెలల బియ్యం సరఫరా చేస్తే తగిన స్థలం ఉంటుందో లేదో అని వచ్చేనెలలోనే విడతల వారీగా షాపులకు బియ్యం సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేయనుండడంతో రవాణా సమస్యలు, అధిక చార్జీలకు చెక్ పడనున్నప్పటికీ వాహనాల కొరత తలెత్తనుందని అధికారులు తెలుపుతున్నారు.

**అన్ని ఏర్పాట్లు చేశాం :జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేష్**

ప్రభుత్వం మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి ఇవ్వాలని ఆదేశించింది. ఇందుకు సంబంధించి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. సమస్యలను అధిగమించి రేషన్ షాపులకు విడతల వారీగా బియ్యం సరఫరా చేస్తాం. లబ్ధిదారులు కూడా మూడు నెలలకు సంబంధించి మూడుసార్లు వేలిముద్రలు వేసి ఒకేసారి బియ్యం తీసుకోవాలి.



## ఫిర్యాదుదారునికి భరోసా, నమ్మకం కలిగించాలి

**వేద న్యూస్, నల్గొండ ప్రత్యేక ప్రతినిధి :**

జిల్లా కేంద్రంలో సోమవారం పోలీసు కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 45 మంది అర్జీదారులతో ఎస్పీశరత్ చంద్ర పవార్. నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని పేర్కొన్నారు. ఫిర్యాదుదారునికి భరోసా, నమ్మకం కలిగించాలని అన్నారు. ఎవరైనా చట్టవ్యతిరకమైన చర్యలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని తెలిపారు.

## చేనేత రంగం పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

వివరాలు 4లో..



### తెల్లవారి నుంచి అర్ధరాత్రి వరకు
# మద్యం విక్రయాలు!

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

వేములపల్లి మండల కేంద్రంలోని పలు గ్రామాలలో మందు బాబులకు మందు నిత్యం అందుబాటులో ఉండడంతో కిక్కులో మునిగిపోతున్నారు. మండలంలో పలు బెల్ట్ షాపుల దుకాణదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో వైన్ షాప్ వ్యాపారులు నిబంధనలకు పాతరేస్తూ దర్జాగా వ్యాపారాన్ని సాగిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. ఎక్సైజ్,పోలీస్లు కనుసనల్లో మండలంలో పలు దుకాణాలలో మందు ఏరులై పారుతుందనే విమర్శలు సైతం ఉన్నాయి. సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీసులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. షాపులలో కూడా అర్ధరాత్రి వరకు బహిరంగ మద్యం విక్రయాలు జరుపుతున్నప్పటికీ సంబంధించిన అధికారులు కన్నెత్తి చూడడం లేదు. పలు గ్రామాలలో రాత్రనకా పగలనకా యువత మద్యం తాగి జల్సాలకు అలవాటు పడడం బాధాకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణదారులు, బెల్ట్ షాపు నిర్వాహకులు నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ మాత్రమే మద్యం అమ్మకాలు జరగాలి. ఆచరణలో నియమ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. బెల్ట్ షాపుల ద్వారా యథేచ్ఛగా 24 గంటలు మందు బాబులకు అమ్మకాలు సాగిస్తూ వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో ఇంత జరుగుతున్నప్పటికీ ఎక్సైజ్,పోలీసులు అధికారులు మాకేం పట్టినట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలంలో పలు గ్రామాలలో అహర్నిశలు మందు దొరు కుతుండడంతో.. పట్టించుకునే నాథులే కరువయ్యారన్నారని కొంతమంది ప్రజలు చర్చించుకుంటున్నారు. నిబంధనలు పాటించే విధంగా ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

# పాత్రికేయుడు మునీర్ మృతి కార్మిక వర్గానికి తీరని లోటు

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**




సీనియర్ జర్నలిస్ట్ ప్రజా సమస్యలపై నిత్యం స్పందించే కామ్రేడ్ మునీర్ అనారోగ్యంతో కన్నుమూయడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో జన్మించిన మునీర్ విద్యార్థి దశలోనే వామపక్ష కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులై యువజన విద్యార్థి రంగాలలో పనిచేసి ఆ తర్వాత భూస్వామ్య పెత్తందారీ వర్గాల అరాచకాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో ముందున్నాడన్నారు. సింగరేణిలో ఉద్యోగం చేస్తూ కార్మిక సమస్యలపై పోరాడుతూ కార్మికుల మన్ననలనుపొందినాడన్నారు. ప్రజల చైతన్య పరచడానికి జర్నలిస్టు వృత్తిని ఎన్నుకొని వివిధ పత్రికలలో పాత్రికేయుడుగా పని చేస్తూ ప్రజల సమస్యలపై అనేక ఆర్టికల్స్ రాస్తూవారి సమస్యల పరిష్కారానికై పోరాడేందుకు కార్యోన్ముఖు లను చేసినాడన్నారు. దేశ రాష్ట్ర రాజకీయాలపై విశ్లేషణలు చేసి సమాజానికి మంచి సందేశాన్ని అందించేవారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో సింగరేణి కోల్ బెల్టు ప్రాంతంలో నిర్వహించిన క్రియాశీలక పాత్ర మరువరానిదన్నారు . నిర్బంధాలకు సైతం వెరవక మొక్కఓని ధైర్యంతో తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఆశయాల కోసం కృషి చేశాడని కొనియాడారు. వారి మరణం ప్రజలకు తీరనిలోటని,ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.సమాజంలో జరుగుతున్న అవకతవకలకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం పోరాడడమే మునీర్ కు నిజమైన నివాళులు అర్పించినట్లు కాగలదని వెంకట్రాములు పేర్కొన్నారు.

# వైఎస్సార్ జిల్లా పేరు మార్పు

**వేద న్యూస్, కడప జిల్లా :**

వైఎస్సార్ జిల్లా పేరును మారుస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. వైఎస్సార్ కడప జిల్లా పేరును కడప జిల్లాగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం జీఓలో పేర్కొంది. వైఎస్సార్ జిల్లాకు కడప పేరును కలపాలని గతంలోనే రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. కాగా 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కడప జిల్లాకు వైఎస్సార్ కడప జిల్లాగా పేరు పెట్టిన విషయం తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు మీద ఆయన




సొంత జిల్లాకు పేరు పెట్టారు. కానీ, ఇప్పుడు ఆ పేరును తొలగిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# తిరుమలలో గోల్డ్ మెన్ సందడి..

**వేద న్యూస్, డెస్క్:**



తిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీ వెంకటేశ్వరుడికి అలంకరించిన వజ్ర వైడూర్యాల ఆభరణాలు తళుక్కు మంటాయి. వెలకట్టలేని స్వర్ణాభరణాలున్న శ్రీవారు ఎన్నో ఆభరణాలతో భక్తులకు రోజూ దర్శన భాగ్యం కలిగిస్తారు. అయితే తిరుమల వెంకన్నను దర్శించుకునేందుకు వచ్చిన ఒక భక్తులు కూడా కిలోల కొద్ది ఆభరణాలతో దర్శనమివ్వడం అందరినీ ఆకర్షించింది. హైదరాబాద్ కు చెందిన విజయ్ కుమార్ అనే భక్తుడు బెంగళూరుకు చెందిన మల్లికార్జున అప్పాజీ తో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. దాదాపు 5 కిలోల బంగారు ఆభరణాలు ధరించి శ్రీవారిని వీఐపీ బ్రేక్ క్యూ లో కనిపించారు. ఆలయ మహా ద్వారం వద్దకు రాగానే ప్రత్యేక ఆకర్షణగా కనిపించిన విజయ్ కుమార్ ఆలయంలోని భక్తులను ఆకట్టుకున్నాడు. మెడనిండా బంగారు గొలుసులు వేసుకుని ఆపద మొక్కుల స్వామిని దర్శించుకున్న విజయ్ కుమార్ ను చూసి భక్తులు ఆలయం ముందు సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

## 107 ఏళ్ల నాటి


# రికార్డు బ్రేక్..!



**వేద న్యూస్, డెస్క్:**

ఆర్థిక రాజధాని ముంబయి మహానగరంలో వర్షాలు దంచికొడుతున్నాయి. గత 75 సంవత్సరాల్లో ఎన్నడూలేని విధంగా నైరుతి రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశించాయి. ఈ క్రమంలో భారీ వర్షం కురిసింది. ఫలితంగా 107 సంవత్సరాల రికార్డు బద్దలయ్యింది. మే మాసంలో 107 సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో భారీ వర్షం కురిసింది. ముంబయికి నైరుతి రుతుపవనాలు చేరాయని వాతావరణశాఖ తెలిపింది. సాధారణంగా జూన్ 11 వరకు వస్తుండగా.. ఈ సారి మాత్రం 16 రోజుల ముందుగానే వచ్చాయని తెలిపింది. భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త సుష్మా నాయర్ మాట్లాడుతూ.. గతంలో నైరుతి రుతుపవనాలు తొలిసారిగా 1956 మే 29న ముంబయికి ముందస్తుగా చేరాయని.. ఆ తర్వాత 1962, 1971లో అదే రోజుల్లో వచ్చినట్లుగా పేర్కొంది. రుతుపవనాల ఆగమనంతో ఉదయం 8.30 నుంచి 11.30 గంటల మధ్య కొలాబాలో 105.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత శాంటాక్రూజ్ (55 మిల్లీమీటర్లు), బాంద్రా 68.5, జుహు విమానాశ్రయం 63.5, చెంబూర్ 38.5, విఖ్రోలి 37.5 , మహాలక్ష్మి 33.5, సియోన్ 53.5లో మిల్లీమీటర్ల వర్షాపాతం రికార్డయినట్లు వాతావరణశాఖ తెలిపింది. జడివాన కారణంగా ముంబయిలోని అనేక లోతట్టు ప్రాంతాలతో పాటు రైల్వే ట్రాక్లు నీటితో నిండిపోయాయి. దాంతో ఉదయం రోడ్లు, స్థానిక రైలు సర్వీసులకు అంతరాయం కలిగింది. బలమైన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో ముంబయిలో కొన్ని గంటల పాటు వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. సెంట్రల్ రైల్వే నెట్వర్క్ లోని మసీదు, బైకుల్లా, దాదర్, మాటుంగా, బద్లాపూర్ రైల్వే స్టేషన్లలో భారీ వర్షాల కారణంగా ట్రాక్లు నీట మునిగాయి.

# చర్చలకు కేంద్రం సుముఖంగా లేదని మావోల విమర్శ



**వేద న్యూస్, డెస్క్:**

ఛత్తీస్గఢ్ రాష్ట్ర సరిహద్దుల్లోని నారాయణ్పూర్ సమీపంలో ఇటీవల జరిగిన ఎన్కౌంటర్లో తమకు చెందిన 28 మంది సభ్యులు మరణించారని మావోయిస్టు వర్గాలు ప్రకటించాయి. మరణించిన వారిలో కీలక నేత బసవరాజు అలియాస్ కేశవరావు కూడా ఉన్నట్లు తెలిపింది. ఈ ఘటనకు సంబంధించి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్ప పేరుతో మావోయిస్టులు ఒక లేఖను విడుదల చేశారు. ఈ లేఖలో, ఎన్కౌంటర్లో ప్రభుత్వం ప్రకటించిన దానికంటే ఒకరు ఎక్కువగా మరణించారని పేర్కొన్నారు. భద్రతా బలగాలతో జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు ప్రభుత్వం వెల్లడించిందని, అయితే మరో మృతదేహాన్ని తాము స్వాధీనం చేసుకున్నామని మావోయిస్టులు తెలిపారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 28కి చేరిందని వారు వివరించారు. అదే సమయంలో, కేంద్ర ప్రభుత్వంపై మావోయిస్టులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాకిస్థాన్ కోరితే కాల్పుల విరమణకు అంగీకరించే కేంద్రం, తాము చర్చల కోసం విజ్ఞప్తి చేసినప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. తమ శాంతి ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని లేఖలో విమర్శించారు.

## ప్రభాకర్ రావు రాజకీయ ఆశ్రయం

# అభ్యర్థనను తిరస్కరించిన అమెరికా

**వేద న్యూస్, డెస్క్:**



తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్ర ప్రత్యేక నిఘా విభాగం (ఎస్ఐబీ) మాజీ అధిపతి టి. ప్రభాకర్రావుకు అమెరికాలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తనను రాజకీయ శరణార్థిగా పరిగణించాలంటూ ఆయన పెట్టుకున్న అభ్యర్థనను అమెరికా ప్రభుత్వం తిరస్కరించింది. ఈ పరిణామంతో ఆయనకు న్యాయపరమైన చిక్కులు మరింత పెరిగినట్లయింది. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తనపై ఈ కేసులు బనాయించారని ప్రభాకర్రావు తన పిటిషన్లో పేర్కొన్నప్పటికీ, అమెరికా అధికారులు ఆయన వాదనను అంగీకరించలేదు. ఇదిలా ఉండగా, ఈ కేసు విచారణలో భాగంగా జూన్ 20వ తేదీలోగా తమ ఎదుట హాజరుకావాలని తెలంగాణ పోలీసులు ప్రభాకర్ రావుకు గతంలోనే నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆయన పోలీసుల విచారణకు సహకరించకపోవడంతో, ఆయన్ను పరారీలో ఉన్న నేరస్థుడిగా (ప్రకటిత నేరస్థుడు) ప్రకటించాలని కోరుతూ సిట్ అధికారులు నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. దీనికి న్యాయస్థానం కూడా సానుకూలంగా స్పందించింది.

జూన్ 20వ తేదీలోగా దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పోలీసులు ఆయన ఇంటి గోడకు నోటీసులు కూడా అంటించారు. నిర్దేశిత గడువులోగా హాజరుకాని పక్షంలో, ఆయన్ను పరా రీలో ఉన్న నేరస్థుడిగా ప్రకటిస్తామని నాంపల్లి కోర్టు హెచ్చరించింది. ఒకవేళ అలా ప్రకటిస్తే, ప్రభాకర్రావుకు సంబంధించిన ఆస్తులను జప్తు చేసే అధికారం దర్యాప్తు సంస్థలకు లభిస్తుంది ప్రస్తుతం అమెరికాలో ఉన్న ప్రభాకర్రావును తిరిగి భారతదేశానికి రప్పించేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం అమెరికాకు చెందిన హెూమ్ల్యాండ్ సెక్యూరిటీ అధికారుల సహాయం తీసుకుంటున్నారు. ప్రభాకర్రావును విచారిస్తే ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. భారత్కు తిరిగి వచ్చి విచారణను ఎదుర్కొనేందుకు ఇష్టపడని ప్రభాకర్రావు, అమెరికాలో రాజకీయ ఆశ్రయం కోసం ప్రయత్నించారు. అయితే, ఆయన అభ్యర్థనను అక్కడి ప్రభుత్వం తిరస్కరించడంతో ఆయనకు అన్ని దారులూ మూసుకుపోతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన హైదరాబాద్కు వచ్చి విచారణకు సహకరించాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ప్రభాకర్రావు పాస్పోర్ట్ను రద్దు చేయగా, అంతర్జాతీయ పోలీసు సంస్థ ఇంటర్పోల్ ఆయనపై రెడ్ కార్నర్ నోటీసును కూడా జారీ చేసింది. ప్రభాకర్రావు ప్రస్తుతం ఏ ప్రాంతంలో ఉన్నారనే సమాచారాన్ని అమెరికా అధికారులు గుర్తించినట్లు సమాచారం.

## పాకిస్తాన్కు సమాచారం..

# సీఆర్పీఎఫ్ జవాన్ అరెస్ట్




**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా వ్యవహారం వెలుగు చూడడంతో కేంద్రం పూర్తిగా అప్రమత్తమైంది. భారత్లో ఉంటూ పాక్కు సున్నిత సమాచారం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గూఢచర్యానికి పాల్పడుతున్న పలువురిని అరెస్టు చేసింది. పలువురు అధికారులు డబ్బుకోసం పాకిస్తాన్కు రహస్యాలు పంపగా.. మరికొందరు హనీట్రాప్లో పడి సున్నిత సమాచారాన్ని పంపుతున్నట్లు తేలింది. తాజాగా గూఢచారుల జాబితాలో సీఆర్పీఎఫ్ జవాన్ సైతం ఉన్నట్లు తేలింది. ఈ వార్త ప్రస్తుతం కలకలం రేగింది. దేశ రక్షణ కోసం పనిచేసే సీఆర్పీఎఫ్ జవాన్ ఒకరు డబ్బు కోసం దేశానికి చెందిన కీలకమైన రహస్యాలు శత్రుదేశానికి చేరవేసినట్లుగా గుర్తించారు. జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ సోమవారం సీఆర్పీఎఫ్ జవాన్ను అరెస్ట్ చేసింది. సదరు జవాన్ను మోతీరామ్ జాట్గా గుర్తించారు. అతను గూఢచర్య కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నట్లు ఎన్ఐఏ గుర్తించింది. 2023 సంవత్సరం నుంచి పాకిస్తాన్ నిఘా అధికారులకు సమాచారం అందిస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది. వివిధ మార్గాల ద్వారా డబ్బు అందుకుంటున్నట్లు ఏజెన్సీ గుర్తించింది. ఎన్ఐఏ బృందం మొదట ఢిల్లీలో మోతీ రామ్ను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసింది. ప్రస్తుతం మోతీరామ్ ఏం సమాచారాన్ని పాకిస్తాన్కు చేరవేశాడన్న కోణంలో అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం. సీఆర్పీఎఫ్ జవాన్ను పాటియాలా హౌస్కోర్టులో హాజరుపరిచింది. నిందితుడికి కోర్టు జూన్ 6 వరకు కస్టడీ విధించింది. ఈ కేసులో కేంద్ర పారామిలిటరీ దళం మోతీరామ్ జాట్ను సర్వీసుల నుంచి తొలగించింది. భారత రాజ్యాంగంలోని సంబంధిత నిబంధనలతో పాటు సీఆర్పీఎఫ్ నిబంధనల ప్రకారం నిందితుడిని మే 21న సర్వీసు నుంచి తొలగించారు. ప్రోటోకాల్ను ఉల్లంఘించిన తర్వాత సీఆర్పీఎఫ్ సిబ్బందిని సర్వీసు నుంచి తొలగించినట్లు తెలిపింది. సీఆర్పీఎఫ్ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి.. దర్యాప్తు కోసం జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించింది. ప్రస్తుతం మోతీరామ్కు ఎవరితో సంబంధాలున్నాయని.. ఎలాంటి సమాచారాన్ని అందజేశాడు.. ప్రతిఫలంగా ఏం తీసుకున్నాడు.. అనే కోణంలో ఎన్ఐఏ విచారణ జరుపుతున్నది.

# గోదావరిలో ఎనిమిది మంది గల్లంతు



వేద న్యూస్, డెస్క్ :

కోనసీమ జిల్లాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. ముమ్మిడివరం మండలం కమినిలంక వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగిన ఎనిమిది మంది యువకులు గల్లంతయ్యారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

వివరాల్లోకి వెళితే, కె.గంగవరం మండలం శురుల్లంక గ్రామంలో జరిగిన ఒక శుభకార్యానికి పలువురు యువకులు హాజరయ్యారు. వీరిలో 11 మంది సరదాగా స్నానం చేసేందుకు సమీపంలోని కమినిలంక వద్ద గోదావరి నదిలోకి దిగారు. అయితే, వారు దిగిన ప్రాంతంలో నది లోతు ఎక్కువగా ఉండటంతో అదుపుతప్పి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. వారిలో ముగ్గురు అతి కష్టం మీద సురక్షితంగా ఒడ్డుకు చేరుకోగా, మిగిలిన ఎనిమిది మంది ఆచూకీ తెలియలేదు. గల్లంతైన యువకులను కాకినాడ, రామచంద్రపురం, మండపేట ప్రాంతాలకు చెందిన క్రాంతి, పాల్, సాయి, సతీష్, మహేశ్, రాజేశ్, రోహిత్, మహేశ్గా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానిక అధికారులు, గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. గజ ఈతగాళ్ల సాయంతో గల్లంతైన వారి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు.

**– సీఎం, డిప్యూటీ సీఎం దిగ్భ్రాంతి**

ఈ దురదృష్టకర ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే ఆయన కోనసీమ జిల్లా కలెక్టర్తో ఫోన్లో మాట్లాడారు. గల్లంతైన యువకులను రక్షించేందుకు తక్షణమే అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గాలింపు చర్యల పురోగతిని కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించారు.

అలాగే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కూడా కోనసీమ జిల్లా కలెక్టర్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన యువకుల ఆచూకీని వీలైనంత త్వరగా కనుగొనేందుకు గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గల్లంతైన యువకుల కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వారి ఆవేదన పలువురిని కంటతడి పెట్టించింది. రాత్రి సమయం కావడంతో గాలింపు చర్యలకు కొంత ఆటంకం ఏర్పడినప్పటికీ, అధికారులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.

## కూటమి ప్రభుత్వానికి

# రోజా సవాల్

**వేద న్యూస్, డెస్క్:**

ఆంధ్రప్రదేశ్లోని కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు మేలు చేసే పథకాలను నిలిపివేశారని, రాష్ట్రంలో అప్పులు, అక్రమాలు, అరాచకాలు పెరిగిపోయాయని ఆమె ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు గుప్పించి, ఇప్పుడు వాటిని నెరవేర్చకుండా చేతులెత్తేశారని ప్రభుత్వంపై ఆమె మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ నిర్వహించబోయే మహానాడును ఉద్దేశించి కూడా రోజా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని మహానాడులో ఒక తీర్మానం చేయగలరా? అంటూ ఆమె సవాల్ విసిరారు. ఇచ్చిన హామీలలో కనీసం ఒక్కటైనా నెరవేర్చినట్లు ప్రజలతో చెప్పించగలరా? అని ప్రశ్నించారు. ఈ విషయంపై చర్చించేందుకు మంగళగిరి, కుప్పం, పిఠాపురం, హిందూపురం.. ఇలా ఎక్కడికి రమ్మన్నా తాను వస్తానని రోజా సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే దమ్ము, ధైర్యం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉందా? అని నిలదీశారు.

# సంపాదకీయం

## కౌలు రైతులపై శీతకన్ను

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల తెలంగాణ రాష్ట్రంలో కౌలు రైతులు (%ఖీుతీఎవతీం%) తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. భూమిపై కౌలు హక్కులు లేకపోవటం వలన ప్రభుత్వ పథకాలకు, పంట నష్ట పరిహారాలకు, సంస్థాగత రుణాలకు దూరమవుతున్నారు. ముఖ్యంగా కౌలు భూమిని పొందటం భూకామందుల ఇష్టాలపై ఆధారపడవలసి వస్తున్నది. భారతదేశం వ్యవసాయిక దేశమని, వ్యవసాయం దేశానికి ఆయువు పట్టని పాలక పార్టీలతోపాటు ప్రతిపక్ష పార్టీలు నిత్యం జపించే మాటలుగా ఉన్నాయి. నేటికీ అత్యధిక ప్రజలకు జీవనాధారంగా ఉన్న వ్యవసాయ రంగం పరిస్థితి, వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తున్న కౌలు రైతులు, పేద రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం ఎడల పాలక పార్టీలు అనుసరిస్తున్న విధానాలు నేడు దేశంలో, రాష్ట్రంలో చర్చించాల్సిన అంశంగా ఉంది. వ్యవసాయానికి సేద్యపు భూమి పునాదిగా ఉంది. ఆ భూమి సేద్యం చేసే వారి వద్ద ఉందా లేక సేద్యం చేయని వారి వద్ద బందీగా ఉందా అన్నదే కీలక అంశం. ఈ అంశమే వ్యవసాయ రంగం స్వరూపాన్ని తెలియచేస్తుంది. అధికార మార్పిడి జరిగి 77 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత కూడా భూసంబందాల్లో మౌలిక మార్పులు జరగలేదు. భూసంస్కరణ చట్టాలు పేదలకు భూములు పంచడంలో విఫలమై అలంకార ప్రాయంగానే ఉన్నాయి. సేద్యం చేసి పంటలు పండించే కౌలురైతుల, పేదరైతులకు సాగు భూమి లేదు. సేద్యం చేయని భూకామందుల వద్ద భూమి కేంద్రీకరణ జరిగింది. ఫలితంగా సేద్యం పై మక్కువ ఉన్న పేదలు భూకామందుల వద్ద భూమిని కౌలుకి తీసుకుని కౌలు దారులుగాను మరి కొందరు కూలీలుగా మారి భూకామందుల దోపిడీకి గురవుతున్నారు.

అధికార మార్పిడి జరిగిన ప్రారంభంలో గ్రామీణ జనాభాలో 35% కౌలు రైతులే. కౌలుదారుకి సాగుదారుగా గుర్తింపు లేని పరిస్థితుల్లో దేశంలోని అనేక రాష్ట్రాల్లో హక్కుల కోసం,సేద్యపు భూమి కోసం కౌలు రైతులు, గ్రామీణ పేదలు ఆందోళనా పోరాటాలు చేశారు. ఈ పోరాటాలు కొన్ని ప్రాంతాల్లో మిలిటెంట్ రూపం తీసుకున్నాయి. వాటిల్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అతి ముఖ్యమైనది. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం కౌలుదారీ సంస్కరణలు, భూసంస్కరణలు చేపట్టక తప్పలేదు. కేంద్ర ప్రభుత్వ కౌలుదారీ సంస్కరణల్లో భాగంగా 1950లో తెలంగాణ కౌలుదారీ చట్టం చేయబడింది. ఈ చట్టానికి ముందు వరుసగా ఆరు సంవత్సరాలు కౌలుదారులుగా ఉన్న వారిని రక్షిత కౌలుదారులుగా గుర్తించి వారికి భూమిపై హక్కులు కల్పించారు. సేద్యపు అవసరాల కోసం భూమిని తనకా పెట్టే హక్కు కూడా చట్టం కల్పించింది. నిబంధనల ప్రకారం కౌలు చెల్లించినంత కాలం కౌలుదారుగా కొనసాగుతాడు. కౌలు దారుకి కల్పించిన హక్కులతోపాటు భూయజమాని సొంత సేద్యం చేసుకునే హక్కు చట్టం కల్పించబడింది. దీన్ని ఉపయోగించుకుని భూకామందులు సొంత సేద్యం పేరుతో భూమి నుంచి కౌలుదారులను తొలగించారు. చివరికి కౌలు విధానం రాత పూర్వకం నుండి నోటి మాటకు మారింది. కౌలు రైతులకు ఎటువంటి హక్కులు లేకుండా పోయాయి. ఆచరణలో కౌలుదారీ చట్టం నిరుపయోగంగా మారింది. 1956లో రాష్ట్రాల పునర్వ్యస్థీకరణ చట్టం వచ్చింది. దేశంలోని రాష్ట్రాల సరిహద్దులు మారాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఒకే రాష్ట్రంగా ఏర్పడింది. 1956 లో ఆంధ్రప్రదేశ్ కౌలుదారీ చట్టం ఆనాటి ప్రభుత్వం చేసింది. ఇది ఆంధ్రా ప్రాంతానికే పరిమితం. తెలంగాణలో 1950 కౌలుదారీ చట్టమే అమల్లో ఉంది. ఉమ్మడి ఏపిలో కాంగ్రెస్ ప్రభుత్వం 2011లో తెచ్చిన కౌలుదారీ చట్టంలో లైసెన్స్ పొందిన కౌలు రైతులకు సంవత్సర ప్రాతిపదికన అర్హత కార్డులు ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. తెలంగాణలో అప్పటికి ఉన్న 17.4 లక్షల కౌలు రైతుల్లో 6.8 లక్షల మంది అర్హత కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా 2011- 12లో 5.1 లక్షల మందికి మాత్రమే కార్డులు ఇచ్చారు. 2012-13లో 4.1 లక్షల మంది కౌలుదారులకే కార్డులు పరిమితమయ్యాయి. ఈ కార్డులు కూడా బ్యాంకుల నుంచి కౌలు రైతులకు పంట రుణాలు అందించలేక పోయాయి. అందుకు కారణం రైతుల అనుమతి పత్రం లేకపోవటమే. ఈ చట్టం కూడా కౌలు రైతులను మభ్యపెట్టి వారి సమస్యలను పక్కదారి పట్టించేందుకు తెచ్చిందే. 2014లో ముఖ్యమంత్రిగా బాధ్యత చేపట్టిన కెసిఆర్ అసలు కౌలు రైతులనే గుర్తించలేదు. ఇది ఫ్యూడల్ అహంకారంనుంచి వచ్చిందే. రేవంతరెడ్డి ముఖ్యమంత్రిగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కౌలు రైతుల పరిష్కార విధానాలు చేపట్టలేదు. తెలంగాణలో 2021 -22లో వ్యవసాయ గణాంకాల లెక్కల ప్రకారం 63.12 లక్షల హెక్టార్ల భూవిస్తీర్ణంలో మొత్తం కమతాల సంఖ్య 64 లక్షలు. అందులో దాదాపు 22 లక్షల కమతాలు కౌలు రైతులవే. వారి సాగు చేస్తున్న భూమి 42% గా ఉంది. ప్రతి ముగ్గురు రైతుల్లో ఒకరు కౌలురైతే. 91% కౌలు చెల్లింపు నగదు రూపంలో ఉండగా, 7.5 శాతం పంట రూపంలో చెల్లిస్తున్నారని, 38.3% ఒప్పంద సమయంలోనే పూర్తిగా కౌలు చెల్లిస్తుంటే, 20.5% సగం కౌలు ముందు సగం తర్వాత చెల్లిస్తున్నారని, 41% కౌలు పంట కోతల తర్వాత చెల్లిస్తున్నారని రైతు స్వరాజ్ వేదిక స్టడీ తెలియచేస్తున్నది. రాష్ట్రంలో కౌలు రైతుల సంఖ్య, కౌలు భూమి విస్తీర్ణం నిరంతరం పెరుగుతూ ఉంది. అత్యధిక మంది కౌలుదారులు ముందుగానే కౌలు డబ్బులు చెల్లించి భూమి సాగు చేస్తున్నారు. పంట నష్టపోయిన సందర్భంలో ఎటువంటి సహాయం అందక అప్పుల్లో కూరుకుపోతున్నారు. భూమిని కౌలుకు ఇవ్వటం ప్రోత్సహించాలని ప్రపంచ బ్యాంక్ చెప్పినందుకు భారతదేశ రాష్ట్ర ప్రభుత్వాలు, భూసంస్కరణలు అమలు జరపకుండా భూమిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే వ్యవసాయ విధానాలు రూపొందిస్తున్నారు. దీన్ని సమర్థించుకోవటానికి చిన్న కమతాల వ్యవసాయం లాభదాయకం కాదని, ఉత్పాదక పెరగదనే ప్రచారం ప్రారంభించారు. వాస్తవంగా చిన్న కమతాల వల్లే ఎక్కువ దిగుబడులు వస్తున్నాయని అనేక సర్వేలు వెల్లడించాయి. మోడీ ప్రభుత్వ సూచనల మేరకు నీతిఆయోగ్ భూమిలేని పేదల వ్యవసాయ సామర్థ్యం మెరుగు పరచటం కోసమంటూ 2016లో వ్యవసాయ భూమి కౌలుపై నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. దేశంలోని వివిధ రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోగల వ్యవసాయ భూమి లీజింగ్‌పై నమూనా చట్టం రూపొందించింది. ఈ నమూన చట్టంలో ప్రభుత్వ అందించే అన్ని రకాల సహాయాలకు కౌలురైతులు అర్హులు అయ్యే విధంగా చట్టం రూపొందించినట్లు చెప్పింది. యజమానికి పూర్తి భద్రత కల్పిస్తూ, కౌలు రైతుకు భూమిపై ఎటువంటి హక్కు ఉండదని, దీర్ఘకాలికంగా భూమిని కౌలుకు తీసుకున్న వారసత్వంగా భూమిని పొందలేడని, ఎలాంటి సమయంలోనైనా కౌలుదారుని ముందుగా హెచ్చరించి కౌలు రద్దు చేసుకోవచ్చని నమూన చట్టంలో పేర్కొన్నారు. భూపంపిణీ గురించి చట్టంలో ప్రస్తావనే లేదు.

గత కౌలుదారీ చట్టాల్లోనూ, నీతిఆయోగ్ నమూనా చట్టంలో గాని కౌలురైతుకు ఎటువంటి హక్కులు లేవు. భూయజమాని ఇష్టాయిష్టాలపై భూమి కోసం కౌలు రైతు ఆధారపడి ఉండాలి. ఇలాంటి చట్టాలు కౌలు రైతుల సమస్యలు పరిష్కరించవు. మానవ మనుగడకు వ్యవసాయం ప్రధాన జీవనాధారం. అలాంటి వ్యవసాయంలో ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతాంగం పరిస్థితి ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. సేద్యపు ఖర్చులు ఎక్కువ కావటం, అందుకు అనుగుణంగా పంటలకు ధరలు లభించకపోవటం, సంస్థాగత రుణాలు అందక అధిక వడ్డీలకు అప్పులు చేయటం, ప్రభుత్వం ప్రకటించే పరిహారాలు అందకపోవటం వల్ల రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు.

# కాన్పూర్‌లో హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత ఇద్దరు ఇంజనీర్ల మృతి

**వేద న్యూస్, డెస్క్:**

కాన్పూర్‌లో తీవ్ర కలకలం రేపిన హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ మరణాల కేసులో నిందితురాలైన డాక్టర్ అనుష్క తివారీ సోమవారం స్థానిక కోర్టులో లొంగిపోయారు. అనంతరం ఆమెను జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వినిత్ కుమార్ దూబె, ప్రమోద్ కటియార్ అనే ఇద్దరు ఇంజనీర్లు ఈ సర్జరీ చేయించుకున్న 48 గంటల వ్యవధిలోనే మృతి చెందడం ఉత్తరప్రదేశ్‌లో తీవ్ర ఆందోళన కలిగించింది. వివరాల్లోకి వెళితే, మృతుల్లో ఒకరైన ఇంజనీర్ వినిత్ కుమార్ దూబె భార్య జయా త్రిపాఠి మే 9న పోలీసులకు ఫిర్యాదు చేశారు. మార్చి 13న తన భర్తకు డాక్టర్ అనుష్క తివారీ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీ చేశారని, ఆ తర్వాత రెండు రోజులకు మార్చి 15న ఆయన మరో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తొలుత ఈ ఘటనపై పోలీసులు తగిన రీతిలో స్పందించలేదని, అందుకే ఫిర్యాదు చేయడంలో ఆలస్యం జరిగిందని జయా త్రిపాఠి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసిన తర్వాతే పోలీసులు మే 9న కేసు నమోదు చేశారని ఆమె తెలిపారు.

మార్చి 14న తన భర్త ముఖం వాచిపోయిందని తనకు ఫోన్ కాల్ ద్వారా తెలిసిందని వినిత్ దూబే భార్య జయా త్రిపాఠి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరించారు. ఆ సమయంలో డాక్టర్ అనుష్క తివారీని సంప్రదించేందుకు ప్రయత్నించినా ఆమె అందుబాటులోకి రాలేదని చెప్పారు. "అదే రోజు రాత్రి సుమారు 11 గంటల సమయంలో మేము మళ్లీ డాక్టర్ అనుష్క తివారీకి కాల్ చేశాం. ఎలాంటి ముందస్తు టెస్టులు చేయకుండానే ఆమె సర్జరీ చేసినట్లు అంగీకరించారు" అని జయా త్రిపాఠి ఆరోపించారు. ఈ సంభాషణకు సంబంధించిన కాల్ రికార్డ్ తన వద్ద ఉందని ఆమె స్పష్టం చేశారు. పరిస్థితి విషమించడంతో తన భర్తను వేరొక ఆసుపత్రికి తరలించగా, మార్చి 15న అక్కడ మరణించారని, ఆ ఘటన జరిగినప్పటి నుంచి డాక్టర్ అనుష్క తివారీ కనపడకుండా పోయారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి ప్రభుత్వ న్యాయవాది దిలీప్ సింగ్ మాట్లాడుతూ, "అనుష్క



తివారీపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. ఆమె డెంటిస్ట్ అయి ఉండి, తన వైద్య పరిధికి సంబంధం లేని సర్జరీ చేశారు. ఇందుకు సంబంధించి మా వద్ద తగిన ఆధారాలున్నాయి. కాకదేవ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశాం. ప్రాథమికంగా చూస్తే అనుష్క తివారీ దోషిగా కనిపిస్తున్నారు. సోమవారం డాక్టర్ అనుష్క తివారీ కోర్టులో లొంగిపోయారు. అనంతరం ఆమెను జైలుకు పంపించాం" అని తెలిపారు.

## జ్యోతి మల్హోత్రాకు 14 రోజుల
# జ్యుడీషియల్ కస్టడీ

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేసిందన్న ఆరోపణలపై అరెస్టయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ హర్యానాలోని హిసార్ స్థానిక కోర్టు ఆదేశాలు జారీ చేసింది. గత గురువారం ఆమె పోలీస్ కస్టడీ ముగియడంతో అధికారులు ఆమెను సోమవారం కోర్టు ముందు హాజరుపరిచారు. వివరాల్లోకి వెళితే, జ్యోతి మల్హోత్రాను మొదట ఐదు రోజుల పాటు పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. ఆ గడువు ముగిసిన అనంతరం, విచారణాధికారులు చేసిన అభ్యర్థన మేరకు కోర్టు మరో నాలుగు రోజులు పోలీస్ కస్టడీని పొడిగించింది. ఈ పొడిగించిన రిమాండ్ కూడా గత గురువారంతో పూర్తి కావడంతో, ఆమెను కోర్టు ముందు హాజరుపరిచారు. వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. పాకిస్థాన్ కోసం గూఢచర్య కార్యకలాపాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఇప్పటివరకు పది మందికి పైగా అరెస్టయ్యారు.

# దేశంలో మళ్ళీ పెరుగుతున్న కరోనా కేసులు

### క్యాన్సర్ రోగులు, రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

భారతదేశంలో కరోనా వైరస్ కేసులు మళ్లీ పెరుగుతుండటంతో ప్రజల్లో కొంత ఆందోళన నెలకొంది. గత వారం రోజులుగా కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక వంటి పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతున్నాయి. దేశంలో పాజిటివ్ కేసుల సంఖ్య వెయ్యి దాటింది. ఈ నేపథ్యంలో, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ కీలకమైన సూచనలు



చేశారు. కరోనా కొత్త వేరియంట్ల గురించి ఎక్కువగా భయపడాల్సిన అవసరం లేదని, అయితే ప్రజలందరూ అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యమని ఆయన నొక్కి చెప్పారు. ప్రస్తుత పరిస్థితిని ప్రభుత్వం మరియు ఇతర సంబంధిత ఏజెన్సీలు నిశితంగా గమనిస్తున్నాయని డాక్టర్ బహల్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా, క్యాన్సర్ రోగులు లేదా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు ఎలాంటి ఇన్ఫెక్షన్ బారిన పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈరోజు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సమాచారం ప్రకారం, దేశవ్యాప్తంగా మొత్తం 1,009 క్రియాశీల కోవిడ్ కేసులు ఉన్నాయి. గత వారం వ్యవధిలో కొత్తగా 750 మందికి కరోనా సోకినట్లు వెల్లడించింది.

## ఆపరేషన్ సింధూర్ ప్రారంభించిన
# 30 నిమిషాల్లోనే పాక్‌కు తెలియజేశాం

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



ఆపరేషన్ సింధూర్ ప్రారంభించిన 30 నిమిషాల్లోనే భారతదేశం పాకిస్తాన్‌కు సమాచారం అందించిందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సోమవారం పార్లమెంటరీ కన్సల్టేటివ్ కమిటీకి తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా భారతదేశం వైమానిక దాడులు నిర్వహించి, పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్ సింధూర్ మే 7 రాత్రి ప్రారంభించింది. ఆపరేషన్ సింధూర్ ప్రారంభమైన అరగంటలోపు ఉగ్రవాద స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటున్నట్లు పాకిస్తాన్‌కు తెలిపినట్లు విదేశాంగ మంత్రి చెప్పినట్లు వర్గాలు తెలిపాయి. విదేశీ వ్యవహారాలపై పార్లమెంటరీ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం ఎస్. జైశంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆపరేషన్ సింధూర్, సీమాంతర ఉగ్రవాదం గురించి చర్చించారు. కెసి వేణుగోపాల్, మనీష్ తివారీ, ముకుల్ వాస్నిక్, ప్రియాంక చతుర్వేది, అపరాజిత సారంగి, గుర్జీత్ సింగ్ ఔజ్లా సహా పలువురు ఎంపీలు ఇందులో పాల్గొన్నారు. ఇస్లామాబాద్ చొరవతో భారతదేశం-పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ ప్రత్యక్ష సంభాషణ జరిపిన తర్వాత, ఉద్రిక్తతలు పెరగకుండా ఉండటానికి ఈ విషయంపై పాకిస్తాన్‌తో వివరించిన తర్వాత రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. ఉగ్రవాద మౌలిక సదుపాయాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని భారతదేశం ఖచ్చితత్వంతో వ్యవహరించిందని, ఉద్రిక్తతలు పెరగకుండా ఉండటానికి పాకిస్తాన్‌కు వెంటనే ఈ విషయాన్ని తెలియజేశామని జైశంకర్ సభ్యులకు వివరించినట్లు సమావేశంలో పాల్గొన్న వర్గాలు తెలిపాయి.



# అబుజ్మద్‌లో చివరి దశకు చేరిన ఆపరేషన్

**వేద న్యూస్, డెస్క్:**

భారతదేశం తన అత్యంత సంక్లిష్టమైన అంతర్గత భద్రతా ముప్పులలో ఒకటైన నక్సలిజాన్ని ఎదుర్కోవడంలో చారిత్రాత్మక పురోగతిని సాధించింది. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలోని అబుజ్‌మద్ అడవులలో 24 రోజుల పాటు జరిగిన అపూర్వమైన ఆపరేషన్‌లో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో 2026 నాటికి భారతదేశం నుండి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించవచ్చని భద్రతా దళాలు ఇప్పుడు నమ్ముతున్నాయి.

# ఎల్ఐసీ గిన్నిస్ రికార్డు

**వేద న్యూస్, డెస్క్:**

ఎల్ఐసీ ఆఫ్ ఇండియా ఒక్కరోజులోనే 5,88,107 పాలసీల ద్వారా వెయ్యి కోట్ల రూపాయల ప్రీమియాన్ని 4,52,839 ఏజెంట్ల ద్వారా సేకరించి ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించింది. దీనికి సంబంధించి ఎల్ఐసీ చైర్మెన్ సిద్ధార్థ మహంతికి ధ్రువీకరణ పత్రాన్ని గిన్నిస్ బుక్ నిర్వాహకులు అందజేశారు. జనవరి 20న దేశవ్యాప్తంగా "మాడ్ మిలియన్ డే" పేరుమీద నూతన వ్యాపారాన్ని సేకరించే లక్ష్యంతో ఏజెంట్లందరినీ పుర మాయించి ఎల్ఐసీ ఈ ఘనత సాధించింది. ఆ కార్యక్రమాన్ని దిగ్విజం చేసిన ఉద్యోగులు, ఏజెంట్లు, మార్కెటింగ్ అధికారులు సర్వదా అభినంద నీయులు. ఎల్ఐసీ రాబోయే రోజుల్లో ఇలాంటి మరిన్ని రికార్డులను నెలకొల్పే అవకాశముందని దీని ద్వారా ప్రస్ఫుటమవుతున్నది. గతేడాది ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డీఏఐ) ఏజెంట్ల కమిషన్, తదితర మార్పులను ఏకపక్షంగా అమలు చేసింది. దీంతో సంస్థలో కొంత నిస్పృహ పూరిత వాతావరణం నెలకొంది. మరోవైపు చట్టాల్లో పెనుమార్పులు తీసుకొచ్చి విదేశీ పెట్టుబడికి అనుకూలంగా ఇన్సూరెన్స్ రంగాన్ని మార్చే ప్రయత్నాలను కేంద్రం ముమ్మరం చేసింది. ఇన్సూరెన్స్ ప్రీమి యంపై జీఎస్టీని తగ్గించడంపై తాత్సారం చేస్తున్నది. అవసరం లేకున్నా జరిపిన వాటాల ఉపసంహరణ (ఐపీఓ) కూడా ఎల్ఐసీకి నష్టదాయకమే. ప్రతికూల పరిస్థితులన్నింటి మధ్య ఒక్క రోజులోనే మహత్తర రికార్డును సాధించడానికి నెహ్రూ స్థాపించిన ఈ ఆధునిక దేవాల యం పట్ల ప్రజలకున్న విశ్వాసమే కారణం.ఎల్ఐసీలో మెజారిటీ కార్మిక సంఘమైన ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) ప్రతి సంవత్సరం జనవరి 19ని ఇన్సూరెన్స్ బిజినెస్ జాతీయ దినోత్సవాన్ని నిర్వ హిస్తూ నూతన వ్యాపార విస్తరణ కోసం కృషిచేస్తున్నది. చైర్మెన్ పిలుపు మేరకు సదరు దినోత్సవాన్ని జనవరి 20న జరపాలని సభ్యులందర్నీ పురమాయించి ఈ మహత్తర కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడంలో ప్రధాన పాత్ర పోషించింది. పాలసీదారులకు గట్టి నమ్మకదారిగా ఉంటూ ప్రతిఫలాత్మక ఫలితాలను ఇవ్వడంలో ముందున్న ఎల్ఐసీలోకి యుకరక్తం రావాల్సిన ఆవశ్యకత ఉంది. రానున్న పదేండ్లలో పెద్ద సంఖ్యలో ఎల్ఐసీలో ఖాళీలు ఏర్పడబోతున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు భర్తీ చేయాలి. కానీ, కేంద్రం ఈ విషయంలో సహ కరించక పోవడం దురదృష్టకరం. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియో గించుకునేందుకు, కొత్త నియామకాలను చేపట్టేందుకు, ప్రతిభావంతులైన ప్రస్తుత సిబ్బందిని మరింత కార్యోన్ముఖులను చేసేందుకు ఎల్ఐసీకి స్వయం ప్రతిపత్తి కల్పించడం ఎంతో అవసరం. ఇది దేశ ఆర్థిక స్వావలంబనను పరిపుష్టం చేసే అంశం.మనదేశంలో ఇన్సూరెన్స్ రంగంలో ఎల్ఐసీతో పాటు మరో 26 కంపెనీలు న్నాయి. ఎల్ఐసీ ఒక్కరోజులో సాధించిన ఘనతను కొన్ని కంపెనీలు ఏడాది మొత్తం పనిచేసినా సాధించట్లేదు. దీన్నిబట్టే ఎల్ఐసీ పట్ల ప్రజలకున్న విశ్వాసమేంటో అర్థమవుతున్నది. ప్రయివేటు కంపెనీల వ్యాపా రాల్లో యాభై శాతం తప్పుదోవలోనే జరుగుతున్నట్టు పార్లమెంట్ సాక్షిగా ఆర్థిక సర్వే ఎత్తిచూపింది. ఆ కంపెనీల్లో సిబ్బంది తొలగింపు నిష్పత్తి కూడా ఎక్కువే. పైగా, అవి పట్టణ ప్రాంతాలకే పరిమితం. ఎల్ఐసీ మాత్రం తన లక్ష్యాన్ని ఏనాడు కూడా మర్చిపోలేదు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ మంది ప్రజలకు ఇన్సూ రన్స్ కవరేజీ అందించే బాధ్యతను భుజాన వేసుకున్నది. ఇలాంటి తరు ణంలో ఎల్ఐసీని కేంద్ర ప్రభుత్వం బలపర్చడం దేశ భవిష్యత్తుకు అవసరం.

వేద న్యూస్

మంగళవారం మే 27, 2025



## లైసెన్స్ లేకుండా అమ్మకం చేస్తే చర్యలు

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలంలో ఉన్నటువంటి విత్తన,ఎరువుల, పురుగు మందుల డీలర్లు అందరికీ వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి గంగా జమున మాట్లాడుతూ రాబోయే సీజన్‌కి తగ్గట్టుగా కొన్ని విధులను తప్పనిసరిగా పాటించవలసిందిగా సూచించడం జరిగింది. డీలర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలి అందరికీ కనిపించే విధంగా ఎదురుగా పెట్టాలి. లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అమ్మకం చేయరాదన్నారు. డీలర్ యొక్క షాపు పేరు, ఇంటి నంబరు ఇతర వివరాలు పెయింట్తో రాయాలి. స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కులపై వ్యవసాయ అధికారితో సర్టిఫై చేయించుకో వాలన్నారు. డీలర్లు విధిగా రైతు కొనుగోలు చేసిన సరుకులకు బిల్లులు, రసీదులు ఇవ్వాలి తెలిపారు. బిల్లులపై తప్పనిసరిగా డీలర్ యొక్క లైసెన్స్ నెంబర్ వేయాలనీ స్టాక్ రిజిస్టర్‌లో కంపెనీల వారీగా స్టాకు నమోదు చేసుకోవాలన్నారు. కంపెనీల నుండి వచ్చే సరుకులను ఇన్వా యిస్ లేనిదే అమ్మకాల స్థలంలో, గోదాముల్లో దించుకొనరాదు. బిల్లు , డీసీలు లేనిదే స్టాక్ సరఫరా చేయరాదు అని హెచ్చరిచారు. లైసెన్స్ లో పేర్కొన్న అడ్రస్ లో మాత్రమే అమ్మకం కానీ నిల్వలు కానీ చేయాలి డీలర్లు చట్టంలో పొందుపరిచిన విధంగా రికార్డు రిజిస్టర్లు బిల్లులు విధిగా పాటించాలి అని సూచించారు. ఎస్సై జక్కుల పరమేష్, డీలర్లు పాల్గొన్నారు.

## సిపిఐ పట్టణ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు

**వేద న్యూస్, సూర్యపేట ప్రతినిధి:**



సూర్యాపేట పట్టణ సిపిఐ కార్యదర్శిగా పట్టణానికి చెందిన బూర వెంకటేశ్వర్లు రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ పట్టణ నాలుగో మహాసభలో తనతో కలిపి 22 మంది కౌన్సిల్, పట్టణ కార్యవర్గగా 14 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణి లో 79 ధరఖాస్తులు

**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**



తెలంగాణ అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు శాఖల వారీగా ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తుకు ఖచ్చితమైన సమాధానం తెలపాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్య లకి సంబంధించి 41 ధరఖాస్తులు జిల్లా సంక్షేమ అధికారికి 5 ధరఖా స్తులు,మున్సిపల్ కమిషనర్లకి 5 దరఖాస్తులు,ఎంపిడిఓ లకి 4 మిగి లిన 24 అర్జీలు వివిధ శాఖలకి సంబంధించి వచ్చాయని మొత్తం 79 ధరఖాస్తులు వచ్చాయని ఆర్జిలను సంబంధిత అధికారులకి పరిష్కరించుట కొరకు పంపటం జరిగిందని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డి ఓ వివి అప్పారావు,డి డబ్ల్యూఓ నరసింహా రావు,సిపిఓ కిషన్, డిఈఓ ఆశోక్, శంకర్, దయానంద రాణి, శ్రీనివాస్ నాయక్, జగదీశ్వర్ రెడ్డి, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, శ్రీనివాసరాజు, శ్రీలత రెడ్డి, వినోద్ కుమార్,అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తి అరెస్టు

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**



ఉద్యోగాలు ఇప్పిస్తానని జనం అమాయకత్వాన్ని పెట్టుబడిగా మార్చుకొని ఏకంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంతకంతో ఫేక్ అపాయింట్ మెంట్ కాపీలు ఇచ్చిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ అరెస్టుకి సంబంధించి సోమవారం హన్మకొండ ఏసిపి నరసింహారావు మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. సోమవారం ఆదాలత్ సెంటర్ వద్ద వాహనాల తనిఖీలో చేస్తుండగా నిందితుడు మంద కళ్యాణ్ ను అరెస్ట్ చేయడం జరిగింది. నిందితుని తండ్రి గతంలో వరంగల్ మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్ జవాన్ గా పని చేసి హార్ట్ అటాక్ తో చనిపోగా, అట్టి పబ్లిక్ హెల్త్ జవాన్ ఉద్యోగం నిందితుడికి రావడం జరిగింది. 2019 నుంచి 2024 వరకు మున్సిపాలిటీలో పని చేసినాడు. ఉద్యోగంలో వచ్చే డబ్బులు జల్సాలకు సరిపోకపోవడంతో 2024 ఫిబ్రవరిలో ఆ ఉద్యోగాన్ని మానేసి, జులాయిగా తిరగడం ప్రారంభించాడు. ఎటువంటి ఆదాయం లేకపోవడం వలన స్నేహితులను మరియు వారి బంధువులని ఈజీగా మోసం చేసి వారి వద్ద నుండి డబ్బులు కాజేయాలని నిర్ణయించుకొని ఎవరైతే ఉద్యోగం లేక ఉద్యోగం కోసం అన్వేషణ్లో ఉన్నారో అలాంటి వారిని ఎంచుకొని, వారితో తనకి పెద్ద పెద్ద వాళ్ళతో పరిచయాలు ఉన్నాయని వరంగల్ కలెక్టర్ ఆఫీస్ లో ఉద్యోగాలు ఇప్పిస్తాను అని మాయమాటలు చెప్పి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని వారిని మోసం చేయాలని దాదాపుగా 40 మంది దగ్గర రూ.16,14,000 వసూలు చేసి, కూరపాటి భవ్య కిరణ్, మంద వంశీ సహకారంతో వారికి ఉద్యోగం ఇస్తున్నట్లుగా నకిలీ నియామక పత్రములు తయారు తీసి, వారిని నమ్మించడానికి సర్వీస్ బుక్ లను ఏర్పాటు చేసి వారిని మోసం చేశాడు. అట్టి నకిలీ నియామక పత్రములపై మరియు సర్వీస్ బుక్ లపై వరంగల్ కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేసి ఇచ్చాడు. కాగా నిందితుడి నుంచి ఒక ద్విచక్ర వాహనము, ఒక కారు, సెల్ ఫోన్స్ పలు వస్తువులను సీజ్ చేయడం జరిగినట్లు ఏసిపి తెలిపారు.

# టీజేఎఫ్ రజతోత్సవ సభలను విజయవంతం చేద్దాం

**■ గుండగోని జయశంకర్ గౌడ్**

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**





ఈనెల 31న హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహిం చనున్న టీజేఎఫ్ రజతోత్సవ సభలను విజయవంతం చేద్దామని టీయూ డబ్ల్యూజే (హెచ్-143) జిల్లా అధ్యక్షులు గుండగోని జయశంకర్ గౌడ్ అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎంపిడివో కార్యాలయ సమా వేశ మందిరంలో యూనియన్ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమ సంస్థగా టీజేఎఫ్ కీలకపాత్ర పోషించిందన్నారు. టీయూ డబ్ల్యూజే (హెచ్-143) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అన్నెబోయిన మట్టయ్య మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ నేతృత్వంలో ఏర్పడిన తెలంగాణ జర్నలిస్టుల ఫోరం అన్ని రాజకీయ పార్టీల నాయకులను ఏకతాటిపైకి తీసుకువచ్చి బలమైన ఉద్యమాన్ని నిర్మించి, గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటాలు కొనసాగించిందన్నారు. నాటి పోరాట ఘట్టాలు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచాయని వివరించారు. జలవిహార్‌లో నిర్వహించనున్న జర్నలిస్టుల జాతరకు అధిక సంఖ్యలో జర్నలిస్టులు తరలివచ్చి రజతోత్సవ సభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం టీజేఎఫ్ రజతోత్సవ మహాసభ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే (హెచ్-143) మిర్యాలగూడ నియోజకవర్గ కమిటీ, మిర్యాలగూడ పట్టణం మండల కమిటీ నూతన కార్యవర్గాలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (హెచ్-143) జిల్లా ప్రధాన కార్యదర్శి శేషరాజుపల్లి వీరస్వామి,జిల్లా సహాయ కార్యదర్శి దండ భాస్కర్,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లె నాగిరెడ్డి, విరగని లక్ష్మీనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు బొంగరాల మట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

### టీయూడబ్ల్యూజే హెచ్-143 మిర్యాలగూడ నియోజకవర్గ నూతన కార్యవర్గం ఎన్నిక

టీయూడబ్ల్యూజే (హెచ్-143) గౌరవ అధ్యక్షులుగా వల్లాల వేణు, లీగల్ అడ్వైజర్లుగా బి.వేణుగోపాల్ రావు, జె. శ్రీనివాస్, అధ్యక్షులుగా జంగా లక్ష్మణ్ యాదవ్, ఉపాధ్యక్షులుగా దైద రవిందర్, కుంచం వెంకట్, ఎం. రామానుజాచారి, ప్రధాన కార్యదర్శిగా కోయ సునీల్, సహాయ కార్యదర్శులుగా మంద లక్ష్మణ్, కాట్రాజ్ అశోక్, దైద వెంకటేశ్వర్లు, బొంగర్ల సైదులు, కోశాధికారిగా ఎం.రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా కొలిపాక నాగేందర్,పుట్టల నగేష్,జెర్రిపోతుల ప్రసాద్, కందుకూరి సుదర్శన్,చిట్యాల సురేందర్,ములుకూరి వినయ్, దైద నాగరాజు (గని) తదితరులు ఎన్నికయ్యారు.

### టీయూడబ్ల్యూజే (హెచ్-143) మిర్యాలగూడ టౌన్ మండల కమిటీ ఎన్నిక

గౌరవ అధ్యక్షులుగా ఎంఎన్ రెడ్డి, అధ్యక్షునిగా ధనావత్ రమేష్ నాయక్, ఉపాధ్యక్షులుగా కందుకూరి సుదర్శన్,రోషన్, ప్రధాన కార్యదర్శిగా నడ్డి. శివకృష్ణ, సహాయ కార్యదర్శులుగా వరకాల సురేష్, ఇండ్ల గణేష్, కోశాధికారిగా కడియం కరుణాకర్, కార్యవర్గ సభ్యులుగా తిరందాసు విష్ణు, పగడాల నగేష్ తదితరులు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని శాలువాలతో సత్కరించిన పలువురు జర్నలిస్టులు అభినందనలు తెలియజేశారు.

# చేనేత రంగం పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**



వ్యవసాయ రంగం తర్వాత అత్యంత ప్రాధాన్యతగల చేనేత రంగం పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. సమాజంతోనే పుట్టిన చేనేత వృత్తి పాలకుల నిర్లక్షం కారణంగా రాను రాను నిర్వీర్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రంగానికీ ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు ఈ వృత్తి ఆధునీకరించి చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు చేనేత రంగాన్ని పరిరక్షించాలి తదితర డిమాండ్లలపై తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూమ్ భవన్ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. తెలంగాణ చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. సిపిఐ ఎంఎల్ నెల్లికంటి సత్యం, చేనేత రంగ నిపుణులు దొంతి నర్సింహ్మారెడ్డి, సిపిఐ(ఎం)సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్ చేరుపల్లి సీతారాములు, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మి నరసయ్య, చేనేత సంఘాల నాయకులు కర్నాటి ధనంజయ, చిక్క దేవాదాసు , రాపోలు జగన్, దాసు సురేష్, రాపోలు వీర మోహన్,ఏశాల అశోక్, కోట రాజయ్య, జల్టి రాములు, పెండెం సర్వేశం, చేవూరి ధనంజయ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎస్ సబ్ తరహాలో బిసిలకు సైతం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. తద్వారా కుల వృత్తుల పరిరక్షణకు వృత్తుల వారికి నిధులను కేటాయించి వాటిని ఆధునీకరించి వాటిపై ఆధారపడిన కుటుంబాలకు ఉపాధి కల్పించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. చేనేత కార్మికులు దీర్ఘ కాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో చేనేత సహకారా సంఘాలకు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని దీంతో చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అయితే ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన తమ వర్గ స్వభావం ఒక్కటే అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన ప్రభుత్వం వాటిని దాటే వేసే ప్రయత్నం చేస్తోందని, ఇది మంచింది కాదని ఇలాంటివే భవిష్యత్ అధికారానికి దూరం చేస్తాయని హెచ్చరించారు. చేనేత రంగం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని కూనంనేని సాంబశివరావు చేనేత సంఘాల నాయకులకు హామీ ఇచ్చారు. ఎంఎల్ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పాలకులందరూ ఒక్క తాను ముక్కలేనని, ఓటు బ్యాంక్ రాజకీయాలు తప్ప వారికి వృతిదారుల సమస్యలను పరిష్కారించాలనే చిత్తశుద్ధి లేదన్నారు. రైతన్నలు తమ అసాధారణ ఉద్యమంతో కరుడుకట్టిన ప్రధాని నరేంద్ర మోదీ మెడలు వచ్చారని, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడ ఆ తరహా ఉద్యమం అవసరమన్నారు. ఇందుకు రాజకీయాలకు అతీతంగా విశాల వేదిక ఏర్పాటు చేసుకుని ఉద్యమించినప్పుడే పాలకులు మన సమస్యలను పరిష్కరిస్తారని సూచించారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి శాసనమండలి వేదికగా తన గళాన్ని వినిపిస్తానని, మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువ వెళ్లడంతో పాటు ఈ ఉద్యమానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇందుకు సంఘటితం కావాలన్నారు. మురళి మాట్లాడుతూ అధికారమే వజ్రాయుధమని దానిని అందిపుచ్చుకోవాలంటే పద్మశాలిలు చట్టసభల్లో అడుగు పెట్టాలన్నారు. అప్పుడే మన గళం వినిపించడం ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని,ఇందుకు ఇప్పటి నుంచే సంసిద్ధం కావాలని ఆయన కోరారు. నర్సింహారెడ్డి మాట్లాడుతూ జిడిపిలో చేనేత రంగం వాటా 5 శాతమని, ఇంత ఆదాయాన్ని సమకూర్చుతున్న ఈ రంగాన్ని పాలకులు పనికట్టుకుని మరి నిర్లక్షం చేస్తున్నారన్నారు. గతంలో చేనేత రంగానికి నాబార్డు ద్వారా రూ.1000 కోట్లు రుణాలుగా ఇచ్చేందని, వీటిని పూర్తిగా నిలిపివేయడంతో చేనేత కార్మికులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు రుణాలు తీసుకునే వాటిని తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించిన ఈ రౌండ్ టేబుల్ సమావేశం వీటిని ప్రభుత్వానికి అందజేయాలని నిర్ణయించారు.



## జెడ్పీహెచ్ఎస్ కొప్పుల 2004-05 ఎస్సెస్సీ స్టూడెంట్స్ గెట్ టు గెదర్

ఆత్మీయ పలకరింపులు..ఆలింగనాలు..ఎన్నో జ్ఞాపకాలు..చిన్నప్పటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు పూర్వ విద్యార్థులు. శాయంపేట మండలం కొప్పుల గ్రామంలోని శ్రీ విద్యానికేతన్ ప్రాథమిక పా ఠశాల, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఒకటో త రగతి నుంచి టెన్త్ వరకు చదువుకున్న వారంతా ఆదివారం హన్మకొండ జిల్లా పరకాలలోని లలితా కన్వెన్షన్ వేదికగా ఆత్మీయ వేడుకలో కలుసుకున్నారు. 20...25 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న వారంతా ఉన్నత చదువులు, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార తదితర రంగాల్లో, వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా చిన్నప్పటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. రెండు దశాబ్దాల క్రితం తమ జ్ఞాపకాలు, మధుర స్మృతులు, అనుభవాలనూ, అనుభూతులనూ కలబోసుకున్నారు. చిలిపి పనులు, అప్పటి ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని, ఆనాటి ముచ్చట్లను గుర్తు చేసుకుంటూ మురిసిపోయారు. ఒకరికొకరు పరిచయం చేసుకుని, వారి క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. కాగా ఈ కార్యక్రమానికి హాజరైన గురువులపై పూలు చల్లుతూ ఆప్యాయంగా ఆహ్వానం పలికారు. నాడు తమకు చదువు చెప్పిన గురువులకు జ్ఞాపికలు అందజేసి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సత్కరించారు. నేడు వారు తమకు చెప్పిన విద్యాబుద్దుల వల్లే తామంతా ప్రస్తుతం ఇలా ఒక్కోరంగంలో రాణిస్తున్నామని, మీ ఆశీర్వాదాలు, తమ తల్లిదండ్రుల ఆశీస్సుల ఉంటే మరింత రాణించి ఊరికి, మంచి పేరు తీసుకొస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉన్నత స్థానాలకు ఎదిగిన తమ పూర్వ విద్యార్థులను చూసి గురువులు ఆనందించారు. జీవితంలో ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదించారు. తమపై విద్యార్థుల ప్రేమాభినాలు ఎల్లప్పుడు ఉండాలని కోరుకున్నారు. అంతేకాకుండా ఆఫీస్ అటెండర్ గా పనిచేసిన జహీర్ అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యం కోసం ఆ కుటుంబానికి దాదాపు రూ.15వేల ఆర్థికసాయం చేసి ఆదుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు సత్యనారాయణ, రవీందర్ వినయ్ కుమార్, వాసుదేవ్, వేములపల్లి మొగిలి ఆడెపు ఆనంద్, మంద కొమురయ్య, కాడపాక సామెల్, అడిదెల మోహన్ రెడ్డి, కల్లెపు సమ్మయ్య, కొండేటి శ్రీనాథ్ రెడ్డి, తడుక భిక్షపతి, దాసరి ధనుంజయ, తోట కుమారస్వామి, అలువాల రాములు, పల్లెబోయిన రవి, కర్రు రమేష్, ఆకుతోట శంకర్, సాంబమూర్తి, జంపయ్య, అటెండర్ జహీర్‌కు జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. డీజె పాటలకు అనుగుణంగా స్టెప్పులు వేశారు. రోజంతా ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. పూర్వ విద్యార్థులు కొలిపాక సూర్యప్రకాశ్, తోకల సమ్మిరెడ్డి, ఆకుతోట రాజేందర్, వేములపల్లి రమ, ముప్పు స్వప్న తోపాటు పలువురు పూర్వ ఉపాధ్యాయులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - వేద న్యూస్, శాయంపేట

## లక్ష్యం పెట్టుకుని చదివితే ఏదైనా సాధించవచ్చు

**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**

విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చుని,భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదుగుతారని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. పదవ తరగతి అనంతరం నిర్వహించే రాష్ట్రస్థాయి పాలిసెట్ నందు రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన నూతనకల్ మండలం మిర్యాల గ్రామానికి చెందిన విద్యార్థిని శ్రీజను జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్పీ నరసింహ అభినందించారు. విద్యార్థులు పాఠశాల దశ నుండే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదవాలని అన్నారు. 10వ తరగతి తర్వాత ఎంచుకునే లక్ష్యం విద్యార్థులను ఉన్నతమైన గమ్యం వైపు నడిపిస్తుంది, ఇష్టమైన రంగంలో రాణించడానికి, మంచు భవిష్య త్తుకు పునాది అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ర్ అధనపు ఎస్పి జనార్ధన్ రెడ్డి, సూర్యాపేట డివిజన్ డి యస్ పి ప్రసన్న కుమార్, విద్యార్థిని తండ్రి మధుసూధన్ రావు, స్నేహితులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

### పోలీస్ ప్రజావాణి కార్యక్రమం.

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పిర్యాదు దారులతో మాట్లాడి అర్జిలను పరిశీలించారు. పిర్యాదుదారులకు బరోసా కల్పించాలని, ప్రతి అంశాన్ని చట్ట పరిదిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నవమాసాలు మోసి జన్మనిచ్చి, పెంచి, విద్యాబుద్దులు నేర్పి, కష్టపడి ప్రయోజకులుగా తీర్చి దిద్దిన తల్లిదండ్రులను వృద్దాప్యంలో పోషించకుండా వదిలివేయడం చట్టపరంగా నేరం అని ఎస్పీ అన్నారు. వృద్దాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ వారసులపై ఉన్నది, బాధ్యతను విస్మరించి ఇబ్బందులకు గురి చేసినట్లు ఫిర్యాదులు వస్తె సీనియర్ సిటిజన్ యాక్ట్, నూతన చట్టాల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073